

కార్మికులతో మాట్లాడుతున్న సింగరేణి ఛైర్మన్ & ఎండి శ్రీ ఎన్.బలరామ్

# సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్
# సింగరేణి సమాచార ప్రభ

జులై - 2024



గనిలో యోగా చేస్తున్న సింగరేణి కార్మికులు

## ముఖ్యమంత్రి ఆదేశం మేరకు సింగరేణి కారుణ్య నియామకాల గరిష్ట వయోపరిమితి 35 నుంచి 40 ఏళ్లకు పెంపు



డిపెండెంట్ మరియు కారుణ్య ఉద్యోగ నియామక ప్రక్రియలో వారసుల గరిష్ట వయసు ప్రస్తుతం 35 ఏళ్లు ఉండగా, 40 ఏళ్ళకు పెంచుతూ సింగరేణి యాజమాన్యం జూన్ 11వ తేదీన సర్క్యులర్ విడుదల చేసింది. రాష్ట్ర ముఖ్యమంత్రి గౌ.శ్రీ రేవంత్ రెడ్డి గారు, రాష్ట్ర ఇంధన శాఖ మంత్రి గౌ.శ్రీ భట్టి విక్రమార్క మల్లు గారి ఆదేశం మేరకు సంస్థ ఛైర్మన్ అండ్ ఎండీ శ్రీ ఎన్.బలరామ్ ఈ ఉత్తర్వులు జారీ చేశారు.



ఈ పెంపుదల వల్ల అనేక మంది వారసులకు మేలు జరగనుంది. ఇటీవల హైదరాబాద్‌లో కారుణ్య వారసులకు ఉద్యోగ నియామక పత్రాలు పంపిణీ చేస్తున్న సభలో రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ ఎనుముల రేవంత్ రెడ్డి గారు మాట్లాడుతూ వారసుల గరిష్ట వయోపరిమితిని త్వరలో పెంచనున్నట్లు హామీ ప్రకటించారు. ముఖ్యమంత్రి ఆదేశంతో వెంటనే యాజమాన్యం వయోపరిమితిని 35 నుండి 40 ఏళ్ళకు పెంచుతూ సర్క్యులర్ విడుదల చేసింది. దీనిపై కార్మిక కుటుంబాల్లో హర్షం వ్యక్తం అవుతుంది.

## సింగరేణి సంస్థకు, ఛైర్మన్ అండ్ ఎండీ శ్రీ ఎన్. బలరామ్‌కు జాతీయస్థాయి 'అత్యుత్తమ పనితీరు అవార్డులు'



కంపెనీ అభివృద్ధికి అహర్నిషలు కృషి చేస్తున్న సింగరేణి సంస్థ ఛైర్మన్ మరియు ఎండీ శ్రీ ఎన్.బలరామ్‌కు, రికార్డు స్థాయిలో బొగ్గు ఉత్పత్తి చేస్తున్న సింగరేణి సంస్థకు ప్రతిష్ఠాత్మక పెర్ఫార్మెన్స్ ఎక్స్ లెన్స్ (అత్యుత్తమ పనితీరు) అవార్డులను ఇండియన్ ఇన్స్టిట్యూషన్ ఆఫ్ ఇండస్ట్రియల్ ఇంజనీరింగ్ సంస్థ వారు ఉత్తరాఖండ్ రాష్ట్రంలో ముస్సోరిలో జూన్ 1వ తేదీన బహుకరించారు. ఈ అవార్డులను ఛైర్మన్ తరపున డైరెక్టర్ ఆపరేషన్స్ మరియు పా శ్రీ ఎన్.వి.కె. శ్రీనివాస్ స్వీకరించారు. సంస్థ ఛైర్మన్ శ్రీ ఎన్.బలరామ్ నిత్యం ఉత్పత్తి, ఉత్పాదకత పెంపుదలకు సమీక్షలు నిర్వహించడమే కాక స్వయంగా గనులను, పని ప్రదేశాలను సందర్శించి ప్రతి ఒక్కరిలోనూ స్ఫూర్తిని కలిగించారు. ఫలితంగా సింగరేణి సంస్థ 2023-24లో 700 లక్షల టన్నులబొగ్గు ఉత్పత్తి, బొగ్గు రవాణా సాధించింది. సంస్థ ఛైర్మన్ శ్రీ ఎన్.బలరామ్ అన్ని ఏరియాలు, గనులు తిరుగుతూ ఉత్పత్తి పెంపుదలకు నిరంతరాయంగా శ్రమించారు. డైరెక్టర్లు, ఏరియా ఉన్నత అధికారులు, కార్మికులు, ఉద్యోగులు సమిష్టిగా పని చేసి రికార్డు స్థాయిలో ఉత్పత్తిని సాధించారు. దీనికి గుర్తింపుగా అత్యుత్తమ పెర్ఫార్మెన్స్ అవార్డులను అందుకోవడం జరిగింది.

## అడ్డదారిలో అన్ ఫిట్ చేపిస్తామనే మోసగాళ్లను నమ్మకండి-విజిలెన్స్ కు ఫిర్యాదు చేయండి



కారుణ్య ఉద్యోగ నియామక ప్రక్రియలో మెడికల్ బోర్డులో అన్‌ఫిట్ చేయిస్తామని నమ్మబలుకుతూ కొందరు మోసగాళ్లు కార్మికులను మభ్యపెట్టి డబ్బులు వసూలు చేస్తున్నట్లు యాజమాన్యం దృష్టికి వచ్చిందని, ఇటువంటి వారిపైన కఠిన చర్యలు తీసుకుంటామని సంస్థ ఛైర్మన్ అండ్ ఎండీ శ్రీ ఎన్.బలరామ్ ప్రకటించారు. ఇటువంటి మోసగాళ్లకు సంబంధించిన సమాచారం 9491144104 నెంబరుకు ఫోన్ చేసి లేదా వాట్సప్ లో పంపించి విజిలెన్స్ శాఖకు తెలియజేయాలని, సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని, మోసగాళ్లను కఠినంగా శిక్షిస్తామని పేర్కొన్నారు.

అనారోగ్య సమస్యలు ఉన్నవారు తప్పక అన్‌ఫిట్ అవుతారని, ఇటువంటి వారిని కూడా లక్ష్యంగా చేసుకొని మోసగాళ్లు భయపెట్టి డబ్బులు వసూలు చేస్తున్నట్లు తెలిసిందని, వీరి మాటలు ఎవరు నమ్మొద్దని ఛైర్మన్ పేర్కొన్నారు. అలాగే సింగరేణి సంస్థలో పూర్తి పారదర్శకంగా కొత్త ఉద్యోగ నియామక ప్రక్రియ నడుస్తోందని, ఎవరైనా మోసగాళ్లు ఉద్యోగాలు ఇప్పిస్తామని మభ్య పెట్టినట్లయితే వారి సమాచారం కూడా విజిలెన్స్ శాఖకు అందించాలని కోరారు. సింగరేణిని అవినీతి రహిత సంస్థగా నిలపడంలో ప్రతి ఒక్కరు సహకరించాలని పిలుపునిచ్చారు.

## క్రమశిక్షణ లేని వారిపై కఠిన చర్యలు, మస్టరు పడి బయట తిరిగితే సహించేది లేదు



దేశంలో అత్యుత్తమ బొగ్గు ఉత్పత్తి సంస్థగా పేరున్న మన సింగరేణిలో కొంతమంది అధికారులు, ఉద్యోగులు విధి నిర్వహణ పట్ల నిర్లక్ష్యంగా ఉంటున్నారని ఫిర్యాదులు వస్తున్న నేపథ్యంలో వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని సంస్థ ఛైర్మన్ మరియు ఎండీ శ్రీ ఎన్.బలరామ్ నిర్ణయించారు. గనుల్లో కొందరు మస్టరుపడి బయటతిరుగుతున్నారని, మరికొందరు సమయపాలన పాటించట్లేదని ఫిర్యాదులు అందుతున్నాయి.మరికొందరు అసలు డ్యూటీకి రాకుండా మస్టరు పడుతున్నారని నిఘావర్గాలు గుర్తించాయి. భోజన విరామ సమయం 30 నిమిషాలు మాత్రమే ఉండగా కొన్నిచోట్ల రెండు నుంచి మూడు గంటల వరకు ఈ సమయాన్ని వాడుకుంటున్నారని, ఈ విధమైన అలవాటుకు ఇక స్వస్తి చెప్పాలని ఛైర్మన్ భావిస్తున్నారు. ఈ మేరకు అన్ని ఏరియాల్లో గనులు, కార్యాలయాలలో ఈ మేరకు సీసీ కెమెరాలు కూడా ఏర్పాటు చేస్తున్నారు.

సింగరేణి సంస్థ ఉత్పత్తి లక్ష్యాలు సాధించాలన్న ఉద్దేశంతో కార్మికులు పూర్తి పనిగంటల సద్వినియోగం చేస్తున్నారని, దీనికి అనుగుణంగా సింగరేణిలోని 25 విభాగాల అధికారులు, ఉద్యోగులు కూడా పూర్తి పనిగంటలు పనిచేయాల్సిందేనని ఆయన కోరుతున్నారు.

## ఎస్.టి.పి.పి పై సమీక్షించిన డైరెక్టర్ (ఇ అండ్ ఎం)



సింగరేణి థర్మల్ విద్యుత్ కేంద్రాన్ని డైరెక్టర్ ఇ అండ్ ఎం శ్రీ డి. సత్య నారాయణ రావు ఇటీవల సందర్శించి ఉత్పత్తిపై ప్రత్యేక సమీక్ష నిర్వహించారు. 2024-25 ఆర్థిక సంవత్సరానికి నిర్దేశించిన ఉత్పత్తి లక్ష్యాల సాధనకై మేధోమధనం జరిగింది. ప్రతి ఉద్యోగి నిర్దేశించిన లక్ష్యాలను సాధించడానికి తన వంతు కృషి చేయాలి అన్నారు. అలాగే ఎస్టిపిపిని దేశంలోనే అత్యుత్తమ విద్యుత్ ఉత్పత్తి కేంద్రంగా తీర్చిదిద్దడం లో అంకిత భావం తో పని చేయాలని కోరారు.

## క్వార్టర్ల నిర్మాణాన్ని తనిఖీ చేసిన డైరెక్టర్ (ఆపరేషన్ & పా)



కొత్తగూడెంలో రైటర్ బస్తి, బర్మా క్యాంపులో శిథిలావస్థకు చేరిన 195 క్వార్టర్లను తొలగించి వాటి స్థానంలో కొత్త క్వార్టర్ల నిర్మాణం కంపెనీ చేపట్టింది. ఈ పనులను డైరెక్టర్ ఆపరేషన్స్ & పా శ్రీ ఎన్.వి.కె శ్రీనివాస్ జూన్ 20వ తేదీన ఆకస్మికంగా తనిఖీ చేశారు. నిర్మాణపనులు సకాలంలో నాణ్యతతో పూర్తి చేయాలని, ప్రమాణాలు లోపిస్తే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. కార్యక్రమంలో జి.ఎం. (సివిల్) టి.సూర్యనారాయణ, డిజిఎం పి.రాజశేఖర్ పాల్గొన్నారు.

## మణుగూరు గనుల ఉత్పత్తిని సమీక్షించిన డైరెక్టర్ (పి అండ్ పి)



మణుగూరు ఏరియా పీకేఓసి-2 పీకేఓసి-4 మరియు మణుగూరు ఓపెన్ కాస్ట్ గనులను డైరెక్టర్ ప్లానింగ్ అండ్ ప్రాజెక్ట్ శ్రీ జి.వెంకటేశ్వర్ రెడ్డి జూన్ 24వ తేదీన సందర్శించారు. ఏరియా జీఎం శ్రీ దుర్గం రామచందర్ మరియు సంబంధిత అధికారులతో ఉత్పత్తిపై ప్రత్యేక సమీక్ష నిర్వహించారు ఈ ఏడాదికి ఏరియాకు కేటాయించిన 126.5 లక్షల టన్నుల నాణ్యమైన బొగ్గును ఉత్పత్తి చేయాలని, వర్షాకాలంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఆయన అధికారులతో సమీక్షించారు

## అన్ని ఏరియాలలో ఘనంగా 10వ అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలు


































